క్లుప్తంగా

శంఖారావానికి తరలిరండి



గణేష్ సెంటర్లో ప్రచారం చేస్తున్న నాయకులు

కొయ్యలగూడెం: హైందవ శంఖారావానికి హిందూ సోదరులంతా హాజరు కావాలని వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం మండలం నుంచి 13 బస్సులు ఏర్పాటుచేశామన్నారు. ఉదయం ఆరు గంటలకే గణేష్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్తున్నట్టు తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా రవాణా సదుపాయం కల్పించామన్నారు. బొమ్మ బాబు, కారంకి శ్రీనివాస్, కట్టా సత్యనారాయణ, తవ్వ గోపాల్, కొల్లేపర సుబ్బారావు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



రోడ్డుకు శంకుస్థాపన చేసిన చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.35 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామని ఆమె తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతారామయ్య, కౌన్సిలర్లు లోకారపు వెంకటేశ్వరావు, మానవతా మూర్తి, నాయకులు బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, పెసరగంటి త్రిమూర్తులు, కంచుమర్తి ప్రకాశం, మున్సిపల్ కమిషనర్ కొమ్మని వెంకటరమణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష తులసి పూజ

కొయ్యలగూడెం: గవరవరంలో కొలువైన సత్యదేవునికి ఆదివారం లక్ష తులసి పూజా మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం ముస్తాబైంది. ఆలయ నిర్మించి 90 సంవత్సరాలకు చేరుకున్న సందర్భంగా భక్తులకు ప్రసాదవితరణ చేస్తామని, తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక పూజలు రాత్రి 8 గంటల వరకు కొనసాగుతాయని అర్చకుడు వాడపల్లి ప్రభాకర రామకృష్ణ ఆచార్యులు తెలిపారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బుట్టాయగూడెం: స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మనేంద్రరావును శనివారం కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ మర్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల స్టేట్ అసోసియేషన్‌కు ఎన్నికల్లో జాయింట్ సెక్రటరీగా ప్రిన్సిపాల్ మనేంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. సన్మాన గ్రహీత మనేంద్రరావు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని చెప్పారు.

న్యాయ సేవా కార్యకర్తలకు శిక్షణ

చింతలపూడి: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై అవగాహన పెంపొందించుకొని న్యాయ సహాయం అందజేయాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు అన్నారు. పారా లీగల్ వలంటీర్లకు శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు ఆయన అధ్యక్షత వహించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు పలు చట్టాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్యానల్ అడ్వకేట్స్ ఫణిదీప్, ఏసు పాదం, సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లుగా ట్రస్ట్ సభ్యులు

కామవరపుకోట: పారా లీగల్ వలంటీర్లుగా కామవరపుకోట సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు సత్యనారాయణ, మధుసూదన్‌రావు, దుర్గాప్రసాదరావు నియమితులయ్యారు. రానున్న రోజుల్లో ప్రజలకు న్యాయస్థానాల ఆవశ్యకత, చట్టాల పరిధి, ప్రభుత్వ నుంచి ప్రజలకు వచ్చే సదుపాయాలు, పథకాలపై అవగాహన, మహిళలకు చిన్నారులకు భద్రత, ఆసుపత్రి, పాఠశాల, హాస్టల్‌లో ఉండాల్సిన సదుపాయాలపై అవగాహన కార్యక్రమాలు రూపొందిస్తామని వారు పేర్కొన్నారు.

7 నుంచి పీసా ఎన్నికలు

- ఏజెన్సీ మండలాల్లో చురుగ్గా ఏర్పాట్లు
- 175 గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నిక
- నిర్వాహణకు 48 మంది అధికారులు



లక్ష్మడుగూడెం పంచాయతీ పరిధిలో పీసా ఎన్నికలపై ప్రచారం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో గిరిజన స్వయం పాలన, అధికారాల కోసం ఉద్దేశించిన పీసా(పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ యాక్ట్) కమిటీ ఎన్నికలు ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పీసా ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో టామ్ టామ్ వెయ్యడంతోపాటు కరపత్రాల రూపంలో కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో పీసా ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 175 గ్రామాల్లో పీసా గ్రామ సభలను ఏర్పాటు చేస్తారు. ఆ సభల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు ఆయా మండలాల పరిధిలో తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మండల స్పెషల్ ఆఫీసర్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పీసా ఎన్నికలకు సంబంధించి బుట్టాయగూడెం మండలంలో 20 మంది, జీలుగుమిల్లి మండలంలో 10 మంది, పోలవరంలో 9 మంది, కుక్కునూరులో 8 మంది, వేలేరుపాడులో 10 మంది చొప్పున సిబ్బందిని నియమించారు. ఎంపీడీఓలను ఎన్నికల పర్యవేక్షణ అధికారులుగా ప్రణాళికా బద్ధమైన పనులు చేసే విధంగా నియమించినట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

రెడ్డిగణపవరంలో అభ్యంతరాలు

ఈ నెల 8వ తేదీన బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో పీసా ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికలపై స్థానిక గిరిజనులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రెడ్డిగణపవరం గ్రామంలో పీసా కమిటీ ఏర్పాటుకు నిర్వాసిత కాలనీలైన తూటిగుంట, తల్లవరం, పైడాకులమామిడి, పల్లపూరు, ములగలపల్లి, తెల్లదిబ్బలు గ్రామాలను కలిపి పీసా కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వ గెజిటెట్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో తమకు అన్యాయం జరుగుతుందని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెడ్డిగణపవరం గ్రామానికి ప్రత్యేక పీసా కమిటీ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ప్రత్యేక కమిటీ వేయాలి



రెడ్డిగణపవరం గ్రామ పీసా కమిటీని రెండు కమిటీలుగా విభజించేలా అధికారులు కృషి చేయాలి. జనాభా ప్రాతిపదికన భవిష్యత్‌లో కేటాయించాల్సిన నిధులు, సంక్షేమ కార్యక్రమాల విషయంలో పీసా కమిటీ నిర్వహణకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.
– పి.మంగరాజు, సీపీఎం జిల్లా నేత, రెడ్డిగణపవరం

ప్రశాంత ఎన్నికలకు కృషి



ప్రశాంతమైన వాతావరణంలో పీసా ఎన్నికలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత అధికారులను నియమించాం. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం. ఇందుకు గిరిజనులు కూడా సహకరించాలి.
– కె.జ్యోతి, ఎంపీడీఓ, బుట్టాయగూడెం

పాన్ షాపు దగ్ధం



దగ్ధమైన పాన్‌షాపు

కొయ్యలగూడెం: స్థానిక కొవ్వూరు రోడ్‌లో ఈనెల మూడో తేదీ రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పాన్‌షాపు దగ్ధమైంది. మాదేటి లక్ష్మి అనే మహిళకు చెందిన పాన్ షాపు నుంచి అర్ధరాత్రి సమయంలో మంటలు వస్తుండటంతో స్థానికులు వాటిని ఆర్పే ప్రయత్నం చేశారు. షాపులోపల ఉన్న సామగ్రి దగ్ధమైంది. దీంతో రూ.4 లక్షల వరకు నష్టవాటిల్లిందని లక్ష్మి వాపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరుతుంది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

అంగన్‌వాడీల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం దొరమామిడిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీలు తమ సమస్యల కోసం సమ్మె చేస్తే పరిష్కారానికి గత ప్రభుత్వం రాత పూర్వకంగా హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. సమ్మె సమయంలో టీడీపీ జనసేన, అంగన్‌వాడీలకు మద్దతు ఇచ్చారని, తాము అధికారంలోకి రాగానే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కూటమి నేతలను కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ఆకాష్, గురుగుంట్ల పద్మ, లత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

13న చండీహోమం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 13వ తేదీ పుష్య పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో చండీహోమం నిర్వహిస్తామని స్థానిక నూకాలమ్మ ఆలయ కమిటీ తెలిపింది. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించే చండీహోమంలో పాల్గొనే వారు ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరింది.

ఆలయ నిర్మాణంపై వాగ్వివాదం

కొయ్యలగూడెం: స్థానిక గ్రామదేవత చింతాలమ్మ ఆలయం వద్ద శనివారం కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సంక్రాంతి సంబరాలు నిర్వహణకు కార్యదర్శి పొన్నా రామచంద్రరావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అమ్మవారి నూతన ఆలయ నిర్మాణంపై సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. అమ్మవారికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో సుమారు రూ.40 లక్షల సొమ్ము ఉండి కూడా ఆలయ నిర్మాణం ఎందుకు చేయడం లేదంటూ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు కొందరి పెద్దల పేరిట ఉండటం వల్ల అభ్యంతరం తెలిపారు. మే నెలలోగా ఆలయ నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. ప్రస్తుతం ఉన్న ప్రదేశంలోనా లేక సమీపంలో ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసి అమ్మవారి ఆలయం నిర్మించడం అనేది ఈలోగా నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

అంధుల వెలుగు దివిటీ లూయిస్ బ్రెయిలీ



బ్రెయిలీ జన్మదిన వేడుకల్లో భవిత విద్యార్థులు

లింగపాలెం: అందుల వెలుగు దివిటీ లూయిస్ బ్రెయిలీ జయంతి ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే గొప్ప వేడుకని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమూరి శ్రీహరి అన్నారు. ధర్మాజీగూడెం భవిత కేంద్రంలో నిర్వహించిన అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంధులు కూడా చదువుకోవడానికి ఆరు చుక్కల లిపిని కనుగొన్న మహానుభావుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. అంధత్వంలో ఉన్న ఎందరో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు మాణిక్యమ్మ, భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయిని వెంకటరమణ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: స్థానిక భవిత స్కూల్‌లో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ టి.రామ్మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంధుల విద్య కోసం లూయిస్ బ్రెయిలీ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులు కె.రాజు, జె.పృథ్వీ, కె.వీరాస్వామి బ్రెయిలీ లిపి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ కల్యాణి, హెచ్ఎం ఎం పోసిరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి ఎంఈఓలు డి.సుబ్బారావు, సీహెచ్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లూయి బ్రెయిన్ గొప్పతనాన్ని ఎంఈఓలు వివరించారు. బి.వెంకటేశ్వరరావు, బి.నరేష్, కె.శ్రీహరి పాల్గొన్నారు.

కళాశాలలో భోజన పథకం ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న శ్రీనివాసులు

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకే ఉండే మధ్యాహ్న భోజన పథకాన్ని తాజాగా ఇంటర్మీడియేట్ విద్యార్థులకు కూడా ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడుం పుష్ప, ఎంపీడీఓ కె.శ్రీనివాస బాబు, కూటమి నాయకులు కొణతాల ప్రసాద్, బొడ్డు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెం కాలేజీలో..

లింగపాలెం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎంఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం సురేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాతూరి శ్రీనివాసరావు, ఎంఈఓ కె.రామారావులు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కౌముది పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది జరిగిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. ఇంగ్లీష్ మీడియంను తేవడంలో సఫలీకృతమైనట్టు తెలిపారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, జనసేన నాయకులు కరాటం సాయిబాబా, ఎంఈఓ టి.బాబూరావుల చేతుల మీదుగా డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు భోజనాలు వడ్డించారు. మండల ప్రత్యేక అధికారి లత, తహసీల్దార్ పీవీ చలపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు

- రెండు వాహనాల సీజ్, ఐదుగురిపై కేసు
- 12 ఆవు దూడలు, 8 ఎద్దులు
- గో సంరక్షణశాలకు తరలింపు





సీజ్ చేసిన వాహనాలు, వాహనంలో ఉన్న ఆవు దూడలు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం నాగులపల్లి జాతీయ రహదారిపై గోవుల అక్రమ రవాణాను శనివారం ఉదయం పోలీసులు అడ్డుకున్నారు. రెండు వహనాలను సీజ్ చేశారు. ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నల్లజర్ల వైపు నుంచి ఏలూరు వైపుకు పశువుల అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై (ద్వారకాతిరుమల ఇన్‌చార్జి ఎస్సై) వై.సుధాకర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని, వాహన తనిఖీ చేశారు. ఆ సమయంలో ట్రక్కులకు పూర్తిగా టార్పిలిన్‌లు కట్టి ఉన్న రెండు బొలేరో వాహనాలను తనిఖీ చేయగా, ఒక వాహనంలో 12 ఆవు దూడలు, మరో వాహనంలో 8 ఎద్దులు ఉన్నట్టు గుర్తించారు. తుని మార్కెట్ నుంచి విశాఖ జిల్లా కె.కోటపాడు మండలం, ఎ.కొండూరు గ్రామానికి చెందిన గొట్టివాడ జాన్ అనే వ్యక్తి ఈ పశువులను హనుమాన్ జంక్షన్ మార్కెట్‌కు తరలిస్తున్నట్టు నిర్ధారించారు. దీంతో విశాఖ జిల్లా చోడవరం మండలం, ఖందేపల్లి గ్రామానికి చెందిన బొలేరో వాహనం డ్రైవర్ జెట్టి నాగేశ్వరరావు, హెల్పర్, వాహన యజమాని అయిన విశాఖపట్నం జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కొండూరు గ్రామానికి చెందిన గొట్టివాడ సంజయ్ కుమార్‌లపై, మరో బొలేరో వాహనం డ్రైవర్ విశాఖ జిల్లా ఆనందపురం మండలం వేమగోట్టపాలెంకు చెందిన కొరడా అప్పలరాజు, వేమగోట్టపాలెంకు చెందిన హెల్పర్ కొరడా సురేష్, జాన్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పశువులను తిమ్మనవీడు గోసంరక్షణా కేంద్రానికి తరలించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

జంగారెడ్డిగూడెం: స్థానిక దేవరపల్లి – తల్లాడ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికి గాయాలపాలైన డ్రైవర్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగాలాండ్‌కు చెందిన ట్రాలీ లారీ హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు ఇనుప గొట్టాలు లోడుతో వెళుతుంది. స్థానిక ఎన్టీఆర్ నగర్ వద్దకు వచ్చేసరికి తాడువాయి షుగర్ ఫ్యాక్టరీకి వెళుతున్న చెరకు లోడు ట్రాక్టరు ఎదురుగా రావడంతో, డ్రైవర్ ట్రాలీ లారీని ఓ పక్కకు తిప్పే క్రమంలో చెరుకు ట్రాక్టరును ఢీకొట్టి రోడ్డు అంచున గల కోడిదాసు నర్సింహారావుకు చెందిన కిళ్లీ కొట్టు లోనుంచి దూసుకెళ్లి పక్కనే ఉన్న కనకదుర్గవారి ఆలయాన్ని ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ఘటనలో గాయాలపాలైన డ్రైవర్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో దుకాణాలు, ఆలయం వద్ద ప్రజలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

గోదాదేవికి సారె సమర్పణ



సారెను తీసుకువచ్చిన వికాస తరంగిణి సభ్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాసంలో 20వ రోజు సందర్భంగా కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామ వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో స్వామి వారికి, పద్మావతి అమ్మవారికి, గోదా కృష్ణులకు సారె సమర్పించారు. వివిధ రకాల పుష్పమాలికలు, ఫలములు, తినుబండారములు, పసుపు కుంకుమ, గాజులు, వస్త్రాలు తదితర ద్రవ్యాలను ఆలయంలోని వివిధ దేవతామూర్తులకు సమర్పించారు. తొలుత ఆలయం చుట్టూ సారె సంబరాలతో ప్రదక్షిణ చేశారు. ఆలయం ముందు ప్రత్యేక వేదికపై గోదాకృష్ణులను అలంకరించి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు వాసవి సాయి నగేష్, వెంకట వరలక్ష్మి దంపతులు ఉభయదారులుగా అన్నప్రసాద వితరణ చేశారు. వికాసతరంగిణికి చెందిన పల్లోతు రాంబాబు, రామలక్ష్మి దంపతులు, కంఠమని శ్రీనివాస్, అన్నపూర్ణ దంపతులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే

బుట్టాయగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సంరక్షణ, విద్యను అందించడంలో టీచర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని సీడీపీఓ ఈ.తులసి అన్నారు. బుట్టాయగూడెం మండలం దాసియ్యపాలెం, నిమ్మలగూడెం సెక్టార్ పరిధిలో శనివారం ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్‌హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.పద్మ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

కామవరపుకోట: తడికలపూడిలోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికారత ప్రాంగణంలో మహిళలకు కుట్టు మెషీన్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రెబక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి విద్యలో రెండు నెలల శిక్షణా కాలానికి ఆసక్తి గల నిరుద్యోగ మహిళలు, యువతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

పోలవరం రూరల్: రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అందబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్‌బాషా అన్నారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ రైతు సేవా కేంద్రం వద్ద సబ్ డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించి రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్ ఏడీఏ పి.లలిత సుధారాణి క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్‌పై అవగాహన కల్పించారు. కొత్తపట్టిసీమ గ్రామంలో 50 శాతం రాయితీపై మినుము విత్తనాలు ఇచ్చిన రైతులకు అవగాహన కల్పించారు. పల్లాకు తెగులు యాజమాన్య పద్ధతులను వివరించారు. సమావేశంలో ఏఓ కె.రాంబాబు, కేఆర్‌పురం ఏడీఏ పీజీ బుజ్జిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.